రైతు కుటుంబానికి రూ.50 లక్షలు చెల్లించాలి – మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

లక్ష్మయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

అన్నపురెడ్డిపల్లి, జూలై 7 : అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని జానకీపురంలో అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు పిట్టల లక్ష్మయ్య మృతదేహానికి ఆయన పూలమాల వేసి, నివాళులర్పించారు. రైతు కుటుంబాన్ని ఓదార్చి, అప్పుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతుల ఆత్మహత్యలు పెరిగాయన్నారు. ప్రభుత్వం వచ్చి 7 నెలలు కాక ముందే రైతులు, నిరుద్యోగులు, ఉద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల హామీల్లో భాగంగా రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా పథకాలను అమలు చేయాలన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో అన్నివర్గాల ప్రజలు, రైతులు సంతోషంగా ఉన్నారని, కాంగ్రెస్ పార్టీ బూటకపు హామీలు ఇచ్చి ప్రజలను మభ్య పెట్టి అధికారంలోకి వచ్చి ప్రజలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో గాయాలు

మణుగూరు టౌన్, జూలై 7: పట్టణంలోని భగత్‌సింగ్ నగర్‌లో విద్యుదాఘాతంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. సుతారి మేస్త్రీ వంశీరెడ్డి ఆదివారం భగత్ సింగ్ నగర్‌లో ఓ ఇంటి పైన నిర్మాణ పనిలో నిమగ్నమయ్యాడు. పైన ఉన్న 11 కేవీ వైరు తగలడంతో షాక్‌తో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని స్థానికులు వెంటనే 100 పడకల ఆస్పత్రికి తరలించారు.

గుండెపోటుతో వాచర్ మృతి

రామవరం, జూలై 7: పెనగడప ఫారెస్ట్ రేంజ్ వాచర్ (ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి) గుగులోత్ లాల్‌సింగ్(50) గుండెపోటుతో మృతిచెందాడు. చండుగొండ మండలం తుంగారం తండాకు చెందిన ఇతడు, తిప్పనపల్లి బీట్ పెనగడప సెక్షన్ ఫారెస్ట్ రేంజ్‌లో వాచర్‌గా పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా ఆదివారం తోటి సిబ్బందితో కలిసి సైకిల్‌పై వస్తూ ఒక్కసారిగా కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. గుండెపోటుతో మృతిచెందినట్లుగా తోటి ఉద్యోగులు భావించారు. పోలీసులకు, ఫారెస్ట్ అధికారులకు సమాచారమిచ్చారు. లాల్‌సింగ్‌కు భార్య, కుమారుడు, కుమార్తెలు ఉన్నారు.

సింగరేణి సెక్యూరిటీ గార్డ్ డిస్మిస్

రామవరం, జూలై 7: సింగరేణి కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా ఎస్ అండ్ పీసీ సెక్యూరిటీ గార్డ్‌గా మోరే రమేష్‌కుమార్‌పై అవినీతి ఆరోపణలు రుజువయ్యాయి. దీంతో ఆయనను డిస్మిస్ చేస్తూ యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది.

మాజీ జడ్పీటీసీ సతీమణి మృతికి నివాళి

నివాళి అర్పిస్తున్న మెచ్చా నాగేశ్వరరావు

దమ్మపేట, జూలై 7 : దమ్మపేట మాజీ జడ్పీటీసీ కోండ్రు శ్రీరాములు భార్య అనారోగ్యంతో ఆదివారం మృతిచెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు మండలంలోని అంకంపాలెంలో శ్రీరాములు ఇంటికి చేరుకొని ఆమె భౌతికకాయానికి నివాళులర్పించారు. ఆమె కుటుంబానికి తన సానుభూతిని తెలిపారు. ఆయన వెంట దారా యుగంధర్, గంగరాజు, జిన్నా తదితరులున్నారు.

ఎస్సై ఆత్మహత్యకు కారకులను కఠినంగా శిక్షించాలి

టేకులపల్లి, జూలై 7 : అశ్వారావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ ఆత్మహత్యకు కారమైన సీఐ, కానిస్టేబుళ్లను కఠినంగా శిక్షించాలని టీటీ ఏటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మోకాళ్ల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని కుంటల్ల పంచాయతీ పరిధి అదుగులగూడెంలో ఆయన మాట్లాడారు. ఎస్సై కారకులను కఠినంగా శిక్షించాలని, వారి కుటుంబాన్ని అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకోవాలని ప్రభుత్వాని డిమాండ్ చేశారు.

ఘనంగా ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

టేకులపల్లి, జూలై 7 : మండల పరిధిలోని రాంపురం హరిజనవాడలో ఎంఆర్‌పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముక్కుమూడి శంకర్ మాదిగ ఆధ్వర్యంలో గ్రామ సెంటర్‌లో నారపోగు పెద్దనాగులుమాదిగ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి అనుబంధ సంఘాల జిల్లా కన్వీనర్ నలగట్ల వెంకన్నమాదిగ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమమంలో నారపోగు దేవేందర్, కనకం శ్రీను, మనోహర్, శంకర్ పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న నాయకులు

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- టీబీ జాయింట్ డైరెక్టర్ రాజేశం

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 7 (నమస్తే తెలంగాణ): సీజనల్ వ్యాధుల నియంత్రణకు సంబంధించిన అన్ని మందులతో అప్రమత్తంగా ఉండాలని టీబీ నివారణ జాయింట్ డైరెక్టర్ రాజేశం అన్నారు. ఐడీఓసీలో ఆదివారం వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని, పారిశుధ్యంపై దృష్టి సారించాలని అన్నారు. రెండో విడత దోమల మందు పిచికారీ పూర్తి చేయాలన్నారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా కాల్వలను శుభ్రం చేసుకోవాలన్నారు. గిరిజన సంక్షేమ డీడీ మనెమ్మ, డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర నాయక్, మలేరియా నివారణ అధికారి స్పంధన, డీపీవో చంద్రమౌళి, బీసీ సంక్షేమ శాఖ అధికారి ఇందిర, అడిషనల్ డీఎంహెచ్‌వో సుకృత తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టీబీ నివారణ జాయింట్ డైరెక్టర్ రాజేశం

సమావేశంలో పాల్గొన్న అధికారులు

అమ్మవారికి ఆషాడ బోనం

బోనాల వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అమ్మవారి సన్నిధికి వస్తున్న భక్తులు

పుష్పాలంకరణలో కనకదుర్గ అమ్మవారు

అశ్వారావుపేట టౌన్, జూలై 7 : పట్టణ పరిధిలోని గుర్రాలచెరువు శివారులో వేంచేసియున్న కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ఆదివారం భక్తులు ఆషాడ భోనాల వేడుకను వైభవంగా నిర్వహించారు. ముందుగా గ్రామ ముఖద్వారంలో ముత్యాలమ్మ అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని భోనమెత్తి గ్రామంలో పాదయాత్రగా కనకదుర్గ అమ్మవారి సన్నిధికి చేరుకుని భక్తులు భోనాలు సమర్పించారు. ముందుగా అశ్వారావుపేట ఎమ్మెల్యే ముత్యాలమ్మ అమ్మవారి సన్నిధిలో మహిళలకు భోనమెత్తి ప్రారంభించారు. అనంతరం అన్నసమారాధన వేడుకల్లో ఎమ్మెల్యేతోపాటు భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు భక్తులు పాల్గొన్నారు.

రోడ్డుపై అనాథ.. ఆదరించిన 'మదర్'

గడ్డం గీస్తున్న గూడెల్లి యాకయ్య

చుంచుపల్లి, జూలై 7: 'మానవ సేవే.. మాధవ సేవ' అని అందరం అంటుంటాం. కానీ, దీనిని ఆచరించేది మాత్రం చాలా కొద్దిమందే. ఆ కొద్దిమందిలో ఒకరుగా నిలిచారు– మదర్ థెరిసా సేవాసంస్థ వ్యవస్థాపకుడు గూడెల్లి యాకయ్య. రామవరం ప్రధాన రహదారిపై ఆదివారం మతి స్థిమితంని వ్యకి రోడ్డుపై పడిపోయాడు. అతని నుండి దుర్గంధం వస్తున్నది. చుట్టూ ఈగలు ముసిరాయి. అటుగా వెళ్తున్న వారంతా ఆ వ్యక్తిని చూస్తున్నరేగానీ పట్టించుకోవడం లేదు. అటుగా వెళ్తున్న గూడెల్లి యాకయ్య.. ఆ వ్యక్తిని చూడగానే ఆగారు. తన సంస్థ సభ్యులైన బొట్ల ప్రసాద్, మధుబాబు తదితరులను రప్పించారు. వారంతా కలిసి ఆ అనాథను ఆటోలో తమ సంస్థ కార్యాలయానికి తీసుకెళ్లారు. అక్కడ ఆయనకు గడ్డం గడీసి, కటింగ్ చేశారు. స్నానం చేయించి, కొత్త దుస్తులు తొడిగారు. చేతి గోర్లు కత్తిరించారు. భోజనం పెట్టారు. 'ఇలాంటి వ్యక్తులు ఎవరైనా.. ఎక్కడైనా కనిపిస్తే మాకు తెలపండి. మేము వెళ్లి వారిని తీసుకొచ్చి ఆశ్రయం కల్పిస్తాం' అని గూడెల్లి యాకయ్య కోరారు.

నిద్రిస్తున్న మహిళ మెడలో బంగారం చోరీ

అశ్వారావుపేట రూరల్, జూలై 7 : మండలంలోని ఆసుపాక గ్రామానికి చెందిన దుర్గమ్మ తన నివాసంలో నిద్రిస్తుండగా ఆదివారం వేకువజామున గుర్తుతెలియని వ్యక్తి మెడలోని బంగారం చోరీ చేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. శనివారం తన వ్యవసాయ భూమిలో భర్త వెంకటేశ్వరావు, అల్లుడు వెంకటేశ్వరావు, కూతురు మానసలతో కలిసి పనులు చేసి ఇంటికి వచ్చారు. రాత్రి భోజనం ముగించుకుని ఇంటి ముందు వరండాలో నిద్రిస్తుండగా తెల్లవారుజామున 3గంటల ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి ప్రహరీ గేటు తీసుకుని లోపలి చోరబడి నిద్రిస్తున్న దుర్గమ్మ మెడలోని బంగారు నాన్‌తాడును తీస్తుండగా మేలుకుంది. గుర్తు తెలియని వ్యక్తి నాన్‌తాడును బలవంతంగా లాగడంతో రెండు ముక్కలైంది. దొంగచేతిలో ఉన్న సగభాగం తీసుకుని పారిపోయాడు. భర్త, అల్లుడు ఇద్దరు అశ్వారావుపేట, భద్రాచలం రోడ్ల వైపు వెంబడించినా కనిపించలేదు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

గుండెపోటుతో అటవీశాఖ తాత్కాలిక ఉద్యోగి మృతి

చండ్రుగొండ, జూలై 7 : గుండెపోటుతో అటవీశాఖలో తాత్కలిక వాచర్‌గా విధులు నిర్వహిస్తున్న గుగులోత్ లాల్‌సింగ్(58) గుండెపోటుతో మృతిచెందిన ఘటన ఆదివారం తిప్పనపల్లి అడవిలో చోటు చేసుకున్నది. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులు, పారెస్టు అధికారుల కథనం ప్రకారం... మండలంలోని తుంగారం పంచాయతీ టేకులబంజర గ్రామానికి చెందిన లాల్‌సింగ్ అటవీశాఖలోని రామవరం రేంజ్, తిప్పనపల్లి బీట్‌లో వాచర్‌గా తాత్కలికంగా విధులు నిర్వహిస్తున్నాడు. రోజువారీ విధుల్లో భాగంగా ఆదివారం విధుల నిమిత్తం తన సైకిల్‌పై వెళ్తున్న క్రమంలో అటవీప్రాంతంలో అకస్మాత్తుగా గుండెపోటు వచ్చి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కొత్తగూడెం టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం కలరు. అటవీశాఖలో తాత్కాలిక నిబంధనలపై వాచర్‌గా విధులు నిర్వహిస్తూ విధుల్లో భాగంగా చనిపోయిన లాల్‌సింగ్ కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు అటవీశాఖ ఉన్నతాధికారులను వేడుకుంటున్నారు.

వివాహిత ఆత్మహత్య

ఖమ్మం రూరల్, జూలై 7: మండలంలోని మద్దులపల్లి గ్రామంలో ఓ వివాహిత బలవన్మరణానికి పాల్పడిన ఘటన ఆదివారం వెలుగుచూసింది. రూరల్ ఎస్సై రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. షేక్ జునేరియా బేగం (21)కు ఆదే గ్రామానికి చెందిన షేక్ నజీర్‌తో మూడు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వివాహం అనంతరం కొంతకాలం వారు సంతోషంగా ఉన్నారు. కొద్ది రోజుల తరువాత నజీర్ ఇతర అమ్మాయలతో సన్నిహితంగా ఉంటూ జనేరియా బేగంను వేధించడం ప్రారంభించాడు. ఈ తన ఆత్త షేక్ బేగంకు, ఆడబిడ్డలైన పర్వీన్, హసీనాకు చెప్పినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఆమె భర్త నజీర్‌కు సపోర్టు చేస్తూ మానసికంగా, శారీరకంగా వేధించడం ప్రారంభించారు. ఈ వేధింపులు తట్టుకోలేక పుట్టింటికి వెళ్లి నెలరోజుల పాటు అక్కడే ఉంది. తిరిగి ఈ నెల 4వ తేదీన భర్త వద్దకు వచ్చింది. వచ్చిన తరువాత భర్త,. ఆడబిడ్డల వేధింపులు ఎక్కువయ్యాయి. వేధింపులు తాళలేక ఆదివారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. ఇంటికి వచ్చిన భర్త తలుపులు వేసి ఉండటాన్ని చూసి ఇంటి ప్రక్కల వాళ్ల సహాయంతో తలుపులు పగులగొట్టారు. వెంటనే ఖమ్మం ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా, అప్పటికే ఆమె చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలి తండ్రి షేక్ ముస్తాఫా ఫిర్యాదు మేరకు జువేరియా భర్త నజీర్, తల్లి, ఇద్దరు సోదరిమణులపై ఆత్మహత్యకు ప్రేరేపించే విధంగా చర్యలకు పాల్పడినట్లు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై రామారావు తెలిపారు.

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి

బోనకల్లు, జూలై 7 : సరదాగా మిత్రులతో కలిసి ఈతకు వెళ్లి పోలంపల్లి సమీపంలోని మున్నేరులో మృతిచెందిన ఘటన ఆదివారం చోటు చేసుకున్నది. బోనకల్లుకు చెందిన గుడిమళ్ల గోపాలరావు కుమారుడు సాయికృష్ణ(13)తోపాటు, మరో ఆరుగురు విద్యార్థులు ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలం పోలంపల్లి సమీపంలో ఏర్పాటు చేసిన డ్యాం వద్ద ఈతకు వెళ్లారు. సాయికృష్ణతో పాటూ మరో విద్యార్థి ముందుగా నీటిలోకి దూకారు. కొద్దిసేపటికి ఆ విద్యార్థులు నీటిలో మునిగిపోతున్న విషయాన్ని తోటి విద్యార్థులు గుర్తించి కేకలు వేశారు. అక్కడే చేపలు పడుతున్న జాలరు నీటిలో మునుగుతున్న విద్యార్థిని నీటిలో నుంచి బయటకు తీసుకువచ్చి ప్రాణాలు కాపాడారు. మరో విద్యార్థి ఉన్నాడని చెప్పడంతో జాలరు మరోసారి మున్నేరులో దిగి కాపాడే ప్రయత్నంలో అప్పటికే నీటిలో మునిగిపోయి ప్రాణాలు కోల్పోయాడు. సాయికృష్ణ చింతకాని మండలం నాగులవంచ శ్రీఆదర్శ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. కొడుకు మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

ట్రాన్స్‌ఫార్మర్ కాపర్‌వైరు చోరీ

కొణిజర్ల, జూలై 7: మండలంలోని ఉప్పలచలకలో రెండు వ్యవసాయ ట్రాన్స్‌పార్మర్లను దుండగులు శనివారం రాత్రి ధ్వంసం చేసి అందులోని కాపర్‌వైరును దొంగలించారు. గ్రామానికి చెందిన భూక్యా రమేశ్, బాలు సుందర్, గుగులోత్ బీమా, కానుగుంట్ల వెంకట్రామయ్య, బుక్కా నరేందర్, నరేశ్, మంగ్య, కానుగుంట్ల నాగుల్‌మీరా పొలాలకు విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్లను దుండగులు ధ్వంసం చేశారు. ఈ మేరకు సంబంధిత రైతులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు ఆత్మహత్యాయత్నం

ఖమ్మం, జూలై 7: ఖమ్మం జిల్లా టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు షేక్ అష్జల్‌హాసన్ ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో కుటుంబ సభ్యులు అతనిని ఖమ్మం నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు పగడాల నాగరాజు, ఆర్‌జేసీ కృష్ణ, తాజుద్దీన్ ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. అష్జల్ హాసన్ ఆరోగ్యపరిస్థితి నిలకడగా ఉందని కుటుంబ సభ్యులు వెల్లడించారు.

10న 'డిమాండ్స్ డే'

కొత్తగూడెం అర్బన్, జూలై 7: కేంద్రంలోని ఎన్‌డీయే ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 10న దేశవ్యాప్తంగా 'డిమాండ్స్ డే' పేరుతో ఆందోళన నిర్వహించనున్నట్లు సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బి.మధు తెలిపారు. కొత్తగూడెంలో ఆదివారం సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్మికుల హక్కులపై కేంద్ర ప్రభుత్వం దాడి చేస్తున్నదని, బొగ్గు బ్లాకులు తదితర రూపాల్లో దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్నదని విమర్శించారు. వీటిని ఎండగట్టేందుకు, కార్మికుల హక్కులను సాధించేందుకు డిమాండ్స్ డే నిర్వహించనున్నట్లు వివరించారు. నాయకులు బ్రహ్మచారి, పద్మ, నభి. సత్య, శ్రీను, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

కత్తి దాడిలో గాయపడిన వ్యక్తి మృతి

సాహు ఈశ్వర్(ఫైల్)

రామవరం, జూలై 7: కత్తి దాడులో గాయపడిన సాహు ఈశ్వర్(35) ఆదివారం తెల్లవారుజామున ఖమ్మంలోని ప్రైవేటు ఆసుపత్రిలో మృతిచెందాడు. సింగరేణి కొత్తగూడెం ఏరియా గౌతంపూర్ కాలనీలోని తన ఇంటిలో ఉన్న సాహు ఈశ్వర్‌పై అరికె రమేష్ అనే వ్యక్తి శనివారం కత్తితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన ఆయనను కుటుంబీకులు సింగరేణి ప్రధాన ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఖమ్మంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆయన అక్కడే ఆదివారం తెల్లవారుజామున మృతిచెందాడు. ఇతడికి భార్య, పాప, బాబు ఉన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు పోలీసులు అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పరారీలో ఉన్న నిందితుడు రమేష్ కోసం గాలిస్తున్నారు.

గ్రూప్-1 మెయిన్ పరీక్షకు ఆరుగురు ఎంపిక

ఎర్రుపాలెం, జూలై 7 : మండల పరిధిలోని బనిగండ్లపాడు శిఖా గ్రంథాలయంలో పోటీపరీక్షలకు చదువుతున్న విద్యార్థుల్లో టీజీపీఎస్సీ గ్రూప్–1 మెయిన్ పరీక్షకు ఆరుగురు అర్హత సాధించారు. అర్హత సాధించిన పీట్ల పవన్‌కళ్యాణ్, పీ.పవన్‌కుమార్, పీ.కోటేశ్వరరావు, ఎస్.రామచంద్రరెడ్డి, కే.నరసింహారావు, ఎ.వెంకటేశ్వరరెడ్డిలను గ్రంథాలయ అధికారి శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు తదితరులు అభినందించారు.

ప్రతిఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి

మధిర రూరల్, జూలై 7 : ప్రతిఒక్క రూ సేవా దృక్పథాన్ని అలవర్చుకుని ఎదుటి వారికి సాయం చేయాలని సీనియర్ సిటిజన్ రెపరెండ్ ఎన్.బాబురావు సూచించారు. పట్టణంలోని ఆజాద్ రోడ్డులో ప్రముఖ సామాజిక సేవకుడు లంకా కొండయ్య బృందం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాత్మాగాంధీ ఉచిత పాత దుస్తుల కేంద్రానికి బాబురావు దుస్తులు వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడారు. కార్యక్రమంలో లంకా సేవా పౌండేషన్ వలంటీర్లు పాల్గొన్నారు.

రామయ్యకు స్వర్ణ పుష్పార్చన

రామయ్యకు నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, జూలై 7: భద్రాచలం దివ్యక్షేత్రంలోని అంతరాలయంలో మూలవరులకు అర్చకులు ఆదివారం 108 స్వర్ణ పుష్పాలతో అర్చన చేశారు. నిత్య కల్యాణ మూర్తులకు బేడా మండపంలో శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. కల్యాణ దాతలకు ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

రామయ్యకు పట్టాభిషేకం

పుష్యమి నక్షత్రం సందర్భంగా భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో రామయ్యకు అర్చకులు ఆదివారం పట్టాభిషేకం నిర్వహించారు. నిత్య కల్యాణం అనంతరం అదే వేదికపై పట్టాభిషేకం చేశారు.

రామయ్య సేవలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి

కుటుంబ సమేతంగా రామయ్యను దర్శించుకున్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తి

భద్రాచలం, జూలై 7: భద్రాద్రి రామయ్యను ఆదివారం ఏపీ హైకోర్ట్ న్యాయమూర్తి బీవీఎల్ఎన్ చక్రవర్తి ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతించారు. అంతరాలయంలోని మూలవరుల న్యాయమూర్తి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని ఉపాలయాలను సందర్శించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అర్చకులు వేదాశీర్వచనం, ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు. పట్టణ ఎస్సై విజయలక్ష్మి, ఆలయ అర్చకులు తిరుమల రాఘవాచార్యులు, ఆలయ పర్యవేక్షకుడు లింగాల సాయిబాబా, తదితరులు పాల్గొన్నారు.

రామయ్య సేవలో భద్రాచలం ఏఎస్పీ



స్వామివారిని దర్శించుకున్న ఏఎస్పీ అంకిత్‌కుమార్ సంఖ్వార్

భద్రాచలం, జూలై 7: భద్రాచలం సీతారామచంద్రస్వామిని ఆదివారం భద్రాచలం నూతన ఏఎస్పీ అంకిత్‌కుమార్ సంఖ్వార్ కుటుంబ సమేతంగా దర్శించుకుని మూలవరుల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని ఉపాలయాలను సందర్శించి తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. అర్చకులు వేదాశీర్వచనం, ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం



విరాళం రశీదు స్వీకరిస్తున్న వెంకటేశ్వరరావు దంపతులు

భద్రాచలం, జూలై 7: సీతారామచంద్ర స్వామి దేవస్థానం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి ఏపీలోని పాలకొల్లు పట్టణంలోని చింతల తోటకు చెందిన వెంకటేశ్వరరావు దంపతులు ఆదివారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. ముందుగా అంతరాలయంలోని మూలవరుల వద్ద ప్రత్యేక పూజలు చేసి తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. చెక్కును దేవస్థానం అధికారులకు ఇచ్చి రశీదు స్వీకరించారు. దాత దంపతులను ఆలయ అధికారులు సత్కరించి ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు. దేవస్థానం ఈఈ రవీందర్ రాజు, ఆలయ పర్యవేక్షకుడు లింగాల సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

అద్దె బస్సు డ్రైవర్ల ఆందోళన

ఆందోళన చేస్తున్న అద్దె బస్సు డ్రైవర్లు

కొత్తగూడెం అర్బన్, జూలై 7: ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్లు తమను పర్మినెంట్ చేయాలని, సంస్థ భర్తీ చేయబోయే ఉద్యోగాల్లో సగం కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం కొత్తగూడెం బస్టాండ్ ఎదుట ఆందోళన చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.బ్రహ్మచారి మాట్లాడుతూ.. గత 30 సంవత్సరాలుగా అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్న అద్దె బస్సు డ్రైవర్లను పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అద్దె బస్సు డ్రైవర్ల సమస్యలను పరిష్కరిస్తామని, వారి శ్రమను పరిగణలోకి తీసుకుంటామని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. డి.వీరన్న, భూక్యా రమేష్, లిక్కి బాలరాజు, కత్తి నరసింహారావు, ఉపేష్, సంజీవరావు, సతీష్, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు ఇప్పించాలని ఎమ్మెల్యేకు వినతి

వినతిపత్రం ఇస్తున్న సిబ్బంది

భద్రాచలం, జూలై 7: భద్రాచలం ఏరియా ఆసుపత్రిలోని శానిటేషన్, సెక్యూరిటీ, పేషంట్ కేర్ తదితర విభాగాల్లోని కాంట్రాక్ట్ కార్మికులు ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావును క్యాంప్ కార్యాలయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో కలిశారు. తమకు మూడు నెలలుగా వేతనాలు అందకపోవడంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. తాము గత నెల 10న ఆసుపత్రి ముందు ధర్నా చేసినప్పుడు.. వేతనాలు ఇప్పించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే ఇచ్చిన హామీని ఆయనకు గుర్తు చేశారు. వేతనాలు ఇప్పించాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. ఎమ్మెల్యే స్పందిస్తూ.. ఏరియా ఆస్పత్రి పాలక మండలి సమావేశాన్ని సోమవారం నిర్వహిస్తానని, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అవసరమైతే కాంట్రాక్టర్‌ను తొలగించి, కొత్త వారిని నియమిస్తామన్నారు. తక్షణమే వేతనాలు చెల్లించేలా కృషి చేస్తానన్నారు. సీఐటీయూ నాయకులు ఎంబీ నర్సారెడ్డి, గడ్డం స్వామి, జి.లక్ష్మణ్, నాగరాజు, రమ, నరసింహారావు, రమేష్, నరేంద్ర, రమణ, మమత పాల్గొన్నారు.